## దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

నీట్, నెట్ పరీక్షల పేపర్ లీకేజీని నిరసిస్తూ ఈ నెల 4 న నిర్వహించనున్న దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేటి నాగేశ్వర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి పిలుపునిచ్చారు. మంగళవారం గీతాంజలి కళాశాలలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ విశిష్టమైన నీట్ పరీక్ష దేశ చరిత్రలో ఏనాడు కనీవినీ ఎరగని రీతిలో ఈ ఏడాది అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ పరీక్ష నిర్వహించిన ఎన్‌టిఎను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. అఖిల భారత విద్యార్థి సంఘాలను కలుపుకొని దేశవ్యాప్తంగా ఎల్‌కెజి నుంచి పీజీ వరకు ఈనెల 2న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, పిడిఎస్యు నాయకులు గోవర్ధన్, రోహిత్, హారన్, గోపికృష్ణ పాల్గొన్నారు.

# కార్పొ'రేట్' పాఠశాలల్లో నిబంధనలు గాలికి

- 'ప్రయివేట్'లోనూ ఇదే తీరు
- ఇష్టారాజ్యంగా వేలకు వేలు ఫీజు వసూళ్లు
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి అమ్మకాలు
- తల్లిదండ్రుల జేబులకు చిల్లు
- మొదటి టర్మ్ ఫీజు కడితేనే పాఠ్యపుస్తకాల విక్రయం
- నిద్రావస్థలో విద్యాశాఖ అధికారులు

**ప్రతి ఏడాది జూన్ మాసం వచ్చిదంటే ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పండుగ వసూళ్ల పండుగ ప్రారంభమవుతుంది. అడ్మిషన్, మొదటి టర్మ్ ఫీజులు, యూనిఫాం, ఇతర విద్యాసామగ్రి పేరుతో తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేస్తారు. జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహ రిస్తున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలు విద్యార్థి తల్లిదండ్రులను జలగల్లా పీడిస్తున్నాయి. విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు గాలికి వదిలేసి తాము నిర్ణయించుకున్న రేటును అమలు చేస్తూ ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని జిఒలున్నా వాటిని గాలికి వదిలేశారు. జిల్లాలో ప్రయివేటు స్కూళ్లు వ్యాపార సంస్థగా మారిపోయాయి. ఒకవైపు ఫీజుల దోపిడీకి పాల్పడుతూనే మరోవైపు పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి వారిని ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.**

**ప్రజాశక్తి-రాయచోటి**

జిల్లా వ్యాప్తంగా 535 ప్రయివేటు పాఠశాలలో 93,903 మంది విద్యార్థులున్నారు. పాఠశాలలో నోటీసు బోర్డు వివరాలు ఏర్పాటు చేయాలని ప్రతి ఏడాది ఉన్నతాధికారుల సూచించినప్పటికీ జిల్లా వ్యాప్తంగా ఏ పాఠశాలలోనూ అవి అమలు చేయకపోవడం శోచనీయం. యూనిఫాం, పుస్తకాలు, బెల్టు, బూట్లు, టై, ఐడి కార్డ్ పేరులతో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. దీనిపై విద్యా శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై 10 రోజులు గడిచినప్పటికీ పుస్తకాలు, యూనిఫాం పేరిట రూ. 10 వేలకుపైగా వసూలు చేస్తున్నారు. ఒకటి నుండి 10వ తరగతి వరకు వేల రూపాయలు యాజమాన్యాలు వసూలు చేస్తున్నా విద్యా శాఖ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎల్ కెజి, యుకెజి పేరిట భారీ మొత్తంలో ప్రయివేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. కేవలం నర్సరీ కే రూ.15 వేలు వసూలు చేస్తే, పై తరగతి లకు ఫీజులు మాత్రం ఏ స్థాయిలో వసూలు చేస్తారో అర్థం చేసుకోవచ్చు. పాఠ్యపుస్తకాలు తీసుకోవాలంటే ముందుగా మొదటి టర్మ్ ఫీజు కడితేనే విక్రయిస్తారు. ఫీజు వసూళ్లల్లో ఇదో కొత్త రకం పద్ధతిని పాఠశాలల యాజమాన్యాలు అవలంభిస్తున్నాయి.

రాయచోటిని జిల్లా చేసి రెండు సంవత్సరాలు పూర్తి కావడంతో ఇది అదునుగా భావించిన యాజమాన్యాలు అధికంగా ఫీజులు వసూలు చేస్తూ బడులను వ్యాపార సంస్థలుగా మారుస్తున్నాయి. కార్పొరేట్ యాజమాన్యాల తీరుతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఎక్కువ మంది తల్లితండ్రులు ప్రయివేట్ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. విద్యా బోధనలు, క్రమశిక్షణ, మెరుగైన సేవలం దించడంలో ఏ ప్రయివేట్ పాఠశాలలో సరైన పద్ధతి అవలంభిస్తారని భావించి ఎక్కువగా తల్లిదండ్రులు ప్రయివేట్ పాఠశాలల వైపే వెళ్ళడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలలో మాత్రం కొన్ని ప్రాంతాల్లో సరైన వసతులు లేక పోవడంతో తల్లిదండ్రులు ప్రయివేట్ పాఠశాలలవైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యమే వల్లే ప్రయివేట్ పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదనేది బహిరంగ సత్యం. అధికారుల తీరే ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఇదిలా ఉంటే జిల్లాలో కొన్ని పాఠశాలలకు అనుమతులు కూడా లేవు. వాటిపైన విద్యా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. కొంత మంది ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు అనుమతి

**ప్రయివేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు రేట్లు**

| తరగతి | పుస్తకాల ధర |
|---|---|
| ఎల్‌కెజి | రూ. 4,000 |
| యుకెజి | రూ. 5,000 |
| 1వ తరగతి | రూ. 6,000 |
| 2వ తరగతి | రూ. 6,500 |
| 3వ తరగతి | రూ. 7,000 |
| 4వ తరగతి | రూ. 7,300 |
| 5వ తరగతి | రూ. 7,500 |
| 6వ తరగతి | రూ. 8,000 |
| 7వ తరగతి | రూ. 8,500 |
| 8వ తరగతి | రూ. 9,700 |
| 9వ తరగతి | రూ. 10,500 |
| 10వ తరగతి | రూ. 1,2000 |

నిబంధనలు పాటించడం లేదు. మరి కొన్ని పాఠశాలలు సరైన ఆట స్థలం, పాఠశాల అను మతులు లేనట్లు తెలుస్తుంది. దీనిపైన విద్యా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెడితే తప్ప జిల్లాలో ఉండే ప్రయివేట్ పాఠశాలలు, ఇష్టానుసారంగా వ్యవహరించే పరిస్థితి కనపడుతుంది. ఇప్పటికే పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన పాఠశాలలపై చర్యలు తీసుకో వాలని పలువురు కోరుతున్నారు.

### ఫీజులను నియంత్రించాలి

ప్రయివేటు పాఠశా లలో పిల్లలను చదివించాలంటే భయమేస్తుంది. ప్రతి ఏడాది జూన్ నెలలో పాఠశాలలో ప్రారంభమవుతాయి. పిల్లలకు పాఠశాలలో ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్, మెస్, బస్సు ఫీజు ఇతర వస్తువులపైన అధిక రేట్లు యాజమాన్యం వసూలు చేస్తు న్నారు. సంబంధాలు స్పందించి అధిక ఫీజులు, పాఠ్య పుస్తకాలు రేట్లు ను నియంత్రించాలని కోరుతున్నాం.

**-కె.మారుతి శంకర్, విద్యార్థి తండ్రి, రాయచోటి.**

### విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలి

కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు ఎక్కడ కూడా చర్యలు తీసుకోవడం లేదు. జీవో నెంబర్ ఒకటి 41 ప్రకారం ఏ ఒక్క పాఠశాలలో పాఠ్యపుస్తకాలు కానీ, ఇటువంటి స్టేషనరీ కానీ అమ్మ కూడదని ఉన్నప్పటికీ కానీ ప్రయి వేట్ స్కూళ్ల యాజమాన్యాలు అధిక రేట్లకు విక్రయిస్తున్నాయి. కార్పొరేంట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ పాఠ్య పుస్తకాలు అమ్మకుండా చర్యలు తీసుకోవాలి.

**- సర్వేపల్లి నరసింహ, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ, అన్నమయ్య,**

### చర్యలు తీసుకుంటాం

ఇంత వరకు ఎవరు ఎటు వంటి ఫిర్యాదు చేయలేదు. తల్లిదండ్రులు ఎవరైనా ప్రయివేట్ పాఠశాలలో అధిక ఫీజులు, పుస్త కాల పైన అధిక రేట్లు తీసుకు ంటున్నారని ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల కాలంలో ప్రయివేట్ కరస్పాండెంట్‌లతో సమావేశం కూడా నిర్వహించి ఫీజులపైనా, స్టేషనరీపైనా వారికి సూచనలు చేశాం.

**- వై. శివ ప్రకాష్ రెడ్డి, డిఇఒ, అన్నమయ్య,**

# కలెక్టర్ల బదిలీ

## కడప కలెక్టర్‌గా లోతేటి శివశంకర్ అన్నమయ్య కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్

లోతేటి శివశంకర్

చామకూరి శ్రీధర్

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగ ళవారం మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేసింది. 2021 జులైలో కడప కలెక్టర్‌గా విజయరామరాజు బాధ్యతలు స్వీకరి ంచారు. ఈయన 2024 జులై 02వ తేదీ వరకు సుమారు మూడేళ్లపాటు సేవలం దించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కొత్తప్రభుత్వం అధికారం చేపట్టిన నేపథ్యంలో అధికారులను బదిలీలు చేస్తోంది. ఇందులోభాగంగానే మొదటి విడత కింద ఇటీవల రాష్ట్రంలోని సుమారు 18 జిల్లాలకు చెందిన కలెక్టర్లను బదిలీ చేసింది. తాజాగా మిగిలిపోయిన కలెక్టర్లను ఆయా స్థానాలకు బదిలీలు చేసింది. ఇందులోభాగంగా కడప కలెక్టర్‌గా లోతేటి శివ శంకర్ రానున్నారు. ఈయన బాధ్యతల నిర్వహణలో తనదైన ముద్రవేసినట్లు తెలుస్తోంది. బుధవారం సాయంత్రం లోపు కలెక్టర్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే తరహాలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిషోర్ స్థానంలో చామ కూరి శ్రీధర్‌ను బదిలీ చేసింది. ఈయన సైతం సత్వరమే కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్న కలెక్టర్ అభిషిక్త్‌కిషోర్ 2024 జవనరి 31న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్నెళ్లలోపే బదిలీ కావడం గమనార్హం.

**లోతేటి శివశంకర్ సేవలు**

గుంటూరు జిల్లా నుంచి విభజిత జిల్లా పల్నాడుకు ప్రథమ కలెక్టర్‌గా జయప్రధంగా విధులు నిర్వహించిన ఘతనను సొంతం చేసుకున్నారు. రెండేళ్ల వ్యవధిలోనే తనదైన శైలిలో ఎన్నో వినూత్న కార్యక్రమాలతో కూడిన సేవలందించారనే పేరు పొందారు. ఇందులో మచ్చుకు కొన్నింటిని ప్రస్తావించుకోవాల్సి ఉంది. ప్రతి సోమవారం ప్రజా సమస్యల కోసం వచ్చిన అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయం కల్పించడం మొదలుకుని ఆయా జిల్లాల ప్రత్యేకత ఆధారంగా సాంస్కృతిక కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడం, నెల నెలా సాహిత్య మేళా, అంధుల కోసం ప్రత్యేక కార్యక్రమం, స్వాతంత్ర్య సమరయోధులు, బిఆర్ అంబేద్కర్ వంటి స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రాలు, ఇతర గొప్ప గొప్ప ఛాయాచిత్ర ప్రదర్శనలను ప్రోత్సహించడం, విద్య ఉపాధి రంగాలలో నవోదయం, రైతుకు వం దనం, టెన్త్ టాపర్లకు అభినందన, ఏ డే విత్ కలెక్టర్ పేరిట విద్యా ర్థులతో మమేకం కావడం, గ్రామోదయం, నగరోదయం, కాఫీ విత్ క్లాప్‌మిత్ర, మిషన్ శోభకృత్, సంక్రాంతి సంబరాలు, ఆడపిల్లల్లో రక్త హీనతను అధిగమించడానికి ఉద్దేశించిన బంగారుతల్లి 2.0 వంటి కార్యక్రమాలను జయప్రదంగా అమలు చేయడంతో ఐఎస్‌ఓ 9001 గుర్తింపు లభించింది. దీనికితోడు చేపట్టిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సామాన్యులతో మమేకమై ప్రజా కలెక్టర్‌గా మన్న నలు పొందడం గమనార్హం.

## సాయిబాబా హైస్కూల్‌లో పెచ్చులూడిన తరగతి గది పైకప్పు

- ఆరుగురు విద్యార్థులకు గాయాలు
- చికిత్స కోసం ప్రయివేట్ ఆస్పత్రికి తరలింపు
- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి చెందిన పాఠశాలలో ఘటన
- యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆదేశం
- ఘటనపై ఆరా తీసిన కడప ఎమ్మెల్యే మాధవి

పెచ్చులూడిన గదిని పరిశీలిస్తున్న తాలుకా పోలీసులు

**ప్రజాశక్తి కడప అర్బన్**

కడప నగరంలోని ఐటిఐ సర్కిల్‌లో వైసిపి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాఠశాల మూడో అంతస్థులో ఉన్న 8వ తరగతి గది స్లాబ్ పెచ్చులు ఊడి పడింది సంఘటనలో పాఠాలు వింటున్న ఆరుగురి విద్యార్థులకు గాయా లయ్యాయి. వారిలో ఒక విద్యార్థి తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం వారిని యాజమాన్యం నగరంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. సాయిబాబా పాఠశాలలోని 8వ తరగతి ఇ-1 సెక్షన్ గదిలో మధ్యాహ్నం సమయంలో ఉపాధ్యాయులు బోధించే సమీపంలో మూలన ఉన్నట్టుండి స్లాబ్ పైకప్పు పెచ్చులూడింది. అక్కడ బెంచ్‌లో కూర్చుని పాఠాలు వింటున్న విద్యార్థులకుపై పడడంతో ఆరుగురికి విద్యార్థులకు గాయాలయ్యాయి. ఊహించని సంఘటనతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే స్పందించిన యాజమాన్యం గాయపడిన విద్యార్థులను వెంటనే ప్రయివేట్ హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించారు. ఒక విద్యార్థికి తలకు గాయమై కుట్లు పడినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని కనీసం వసతులు, నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయిబాబా పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి. రామచంద్రారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉండడం గమనార్హం. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. అక్కాయపల్లెలోని ఐటిఐ సర్కిల్ వద్ద ఉన్న ప్రయివేట్ పాఠశాలలో పైకప్పు కూలి ఆరుగురు విద్యార్థులు గాయపడిన ఘటన నన్ను తీవ్రంగా కలచివేసిందని, సంబంధిత విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాల్సిందిగా జిల్లా అధికారులను ఆదేశించారు. అలానే నిబంధనలు పాటించకుండా స్కూలు నడుపుతున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని అంటూ పోస్ట్ చేశారు. ఇదే ఘటనపై కడప ఎమ్మెల్యే మాధవి స్పందిస్తూ పాఠశాలపై కప్పు కూలి విద్యార్థులకు గాయాలు కావడం బాధాకరం. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాను. ఈ సంఘటనపై డిఇఒ వెంటనే స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని చెప్పారు. చట్ట విరుద్ధంగా పాఠశాల నడుస్తున్నట్లు తమ వద్ద గతంలోనే సమాచారం ఉందని తెలిపారు. తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటనపై విచారించారు.

### సాయిబాబా స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

**- విద్యార్థి, యువజన సంఘాల నాయకుల డిమాండ్**

**ప్రజాశక్తి- కడప అర్బన్**

నగరంలోని ఐటిఐ కూడలిలో ఉన్న సాయిబాబా స్కూల్ యాజ మాన్యం నిర్లక్ష్యం కారణంగా స్కూల్ పై కప్పు కూలి 8వ తరగతి విద్యా ర్థులు తీవ్రంగా గాయ పడ్డారని, స్కూలు గుర్తింపు రద్దు చేయాలని, సంఘ టనకు బాధ్యునిగా ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని అరెస్టు చేసి క్రిమినల్ కేసు నమోదు చేయా లని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్కూల్ ఎదుట విద్యార్థి యువజన సంఘాలు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేందర్ ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, గండి సునీల్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు బాబు, పిఎస్‌యు గోపి, పిఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సన్నీ, ఎఐవైఎల్ జిల్లా నాయకులు ఓబయ్య మాట్లాడుతూ ఒత జరుగుతున్నా డిఇఒ, ఆర్‌జెడి కనీసం స్కూల్ తనిఖీ కూడా రాలేదని చెప్పారు. ఎమ్మెల్సీ రామచంద్రరెడ్డి కనీస వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు దగ్గర వేల రూపాయలు వసూలు చేసి, అక్రమ డబ్బుతో ఎమ్మెల్సీ అధికారాన్ని అడ్డు పెట్టుకుని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉన్న విద్యాశాఖ చర్యలు తీసుకోకపోవడం దేనికి నిదర్శనమన్నారు. సాయిబాబా స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి, ఉపాధ్యక్షులు మనోజ్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నర్సింహులు, మిగతా విద్యార్థి, యువజన సంఘాలు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

## సిఎంకు విభిన్నప్రతిభావంతుల కృతజ్ఞతలు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

మన్నూరులోని విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం కార్యాలయంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ తమకు రూ. 3 వేల నుంచి ఒకేసారి రూ. 6వేలు వరకు పింఛన్లు పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కౌన్సిలర్ చెంగమ్మ, మైనారిటీ నాయకులు ఎస్.కె కరీం పాల్గొని మాట్లాడుతూ సామాజిక పింఛన్లు రూ 4 వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.6 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ 15 వేలు పెంచిన ఘనత చంద్రబాబు, పవన్ లకే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తుపాకుల భాష, విభిన్న ప్రతిభావంతుల పుల్లంపేట మండల అధ్యక్షులు మల్లు సుబ్బ నరసారెడ్డి, ఉపాధ్యక్షులు ఖాదర్ భాషా, సభ్యులు శ్రీనివాసులు, వక్కల సుధాకర్, వెంకటప్రసాద్, జైనుల్, షమీ పాల్గొన్నారు.

## 'నాదెండ్ల'ను కలిసిన ఊటుకూరు మాజీ సర్పంచ్

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

హరి ప్రసాద్‌ను సన్మానిస్తున్న లక్ష్మీ నరసయ్య

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఊటుకూరు మాజీ సర్పంచ్ మన్నేరు లక్ష్మీ నరసయ్య మంగళవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. జనసేన నుంచి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్న పి.హరిప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిరువురుని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలి

**- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి యుటిఎఫ్ వినతి**

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు తగు సహకారం అందించాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి యుటిఎఫ్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. మంగళవారం కడపలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్సీని కలిసి విద్యారంగ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రభుత్వ విద్యా రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం విద్యారంగం పట్ల అవలంభించిన విధానాల వల్ల ప్రభుత్వ విద్యా రంగంలో సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ ఆనాలోచిత చర్యలు, అసంబద్ధ విధానాలు ప్రభుత్వ విద్యా రంగాన్ని తిరోగమనం వైపు నడిపించాయని ఆరోపించారు. గత ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడతామని, ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో 117 ను రద్దు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకారం అందించారన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల, పట్టభద్రుల ప్రతినిధిగా విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. 1-5 తరగతులను ప్రాథమిక విద్య పరిధిలో, 6-10 తరగతులను, 6-12 తరగతులను సెకండరీ స్థాయి విద్య పరిధిలో నిర్వహించాలని వారు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, విద్యార్థి, తల్లిదండ్రుల అభీష్టం మేరకు మాధ్యమాన్ని ఎంపిక చేసుకుని చదువుకునే అవకాశాన్ని కల్పించాలని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేసే చర్యలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. నాడు-నేడు కార్యక్రమం బాధ్యతల నుంచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను తప్పించాలని, నూతన మెగా డీఎస్సీ ని నిర్వహించి, నియామకాలు చేపట్టే లోపే ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టి, బదిలీలు నిర్వహించాలన్నారు. 12వ పిఆర్‌సిని అమలు చేయాలని, అయ్యేవరకు మధ్యంతర భృతిని చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ స్పందిస్తూ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, ప్రత్యేకించి ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడుతుందని పేర్కొన్నారు. యుటిఎఫ్ ప్రస్తావించిన సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవి కుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, చెరుకూరి శ్రీనివాసులు, ఎస్.ఎజాస్ అహమ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రూతు ఆరోగ్య మేరి, నాయకులు ఎస్.అనిల్ కుమార్,ఎం.లక్ష్మీ దేవమ్మ, ఎస్.ఎం. బాష పాల్గొన్నారు.

## ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-రాయచోటి**

డిప్యూటీ డిఎంహెచ్ఒ కు వినతిపత్రం అందజేస్తున్న బాస్ సంస్థ నాయకులు

పీలేరు పట్టణంలో మెడికల్ మాఫియా అడ్డాగా శ్రీ చక్ర ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యంపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర నాయకులు పల్లం తాతయ్య, జిల్లా కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మంగళ వారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నందు డిప్యూటీ డిఎంహెచ్ఒ శైలజ కి వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యోనారాయణ హరి అనేది నానుడి గ్రామీణ ప్రాంతాల్లో జ్వరం వచ్చినా చిన్న చిన్న జబ్బులు చేసిన స్థానిక ప్రైవేట్ వైద్యులే చికిత్స చేసి తక్కువ ఖర్చుతో ప్రాణాలు కాపాడేవారు అందుకే వారిని ప్రజలు దేవుడితో సమానంగా భావించేవారు కానీ రానురాను ఆ పరిస్థితి మారిపోతోంది పల్లెలు, మారుమూల గ్రామాలే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు లక్ష్యంగా చేసుకొని మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ మాఫియాలా మారిపో తోంది న్నారు. అందులో భాగంగా పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు నందు గల శ్రీ చక్ర ఆసుపత్రి యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు ఫలితంగా సామాన్యులు ఆరోగ్యంతో పాటు డబ్బు కూడా నష్టపోతున్నారు అన్నారు. ఔషదాలకు ఉండే పరిమితులు, శరీరక ప్రతిస్పందనలు తదితర అంశాలపై అవగాహన లేకుండానే వైద్యసేవలు అందిస్తున్నారు అన్నారు.ఆసుపత్రికి వైద్య సేవల కోసం వచ్చే వారికి అవసరం లేకపోయినా వివిధ రక్తపరీక్షలు, స్కానింగ్ లు,అధిక మందులు రాయడం జరుగుతుంది అన్నారు. ఆదాయం కోసం వారికి అర్హత లేకపోయినా ఇటీవల ఒక ప్రజా ప్రతినిధి మానసిక స్థితి బాగున్నా కూడా ఉన్న మానసిక స్థితి సరిగా లేదని సర్టిఫికెట్ మంజూరు చేశారు కనుక వైద్య రంగానికే మాయనిమచ్చలాంటి సంఘటనలకు పాల్పడిన శ్రీ చక్ర ఆసుపత్రి యాజమాన్యంపై, గుర్తింపు లేని ప్రైవేట్ ఆసుపత్రులపై, ప్రైవేట్ ల్యాబ్ లపై, మరింత నిఘా పెట్టి మెడికల్ మాఫియాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. శ్రీ చక్ర ఆసుపత్రి యాజమాన్యంపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి వారి గుర్తుంపును రద్దు చేయాలని లేని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వారు హెచ్చ రించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు, బాస్ నాయకులు వంగిమల్ల గురునాథ, ఈశ్వరయ్య, పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాశక్తి- రామసముద్రం**

మండలంలోని ఊలపాడు పంచాయతిలోని బుసానికురప్పల్లి గ్రామంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పింఛన్ దారులకు రూ.7వేలు అందించి సిఎం మాట నిలుపుకున్నారని అన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పింఛన్ తీసుకున్న లబ్ధి దారులు అందరూ కలసి చందాలు వేసుకొని దాదాపు 200 మందికి బోజనాలను అందించారు. కార్యక్రమంలో మునిరత్న, సురేష్, రామాంజులు, మల్లెప్ప, వెంకటప్ప, గంగాద్రి, నరేష్, శంకరప్ప, సి శంకరప్ప, వెంకటరమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్టూడెంట్ కిట్స్ పంపిణీ

**ప్రజాశక్తి-కలికిరి**

మండలం ఇందిరమ్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి సీనియర్ నాయ కులు జి.యర్రంరెడ్డి పాల్గొని, విద్యార్థులకు కిట్ పంపిణీ చేశారు. పిల్లలందరు బాగా చదువు కోవాలని మంచిమార్కులు సాదించాలని అన్నారు. ఈ సందర్భంగా 2024-25వ విద్యా సంవ త్సరం పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మొదటి బాహుమతిగా రూ.10,116లు, రెండవ బహుమతిగా రూ.5,116లు, మూడవ బహుమతిగా రూ.3116లుగా బహుమతి ప్రదానం చేస్తానని, పిల్లలను ప్రోత్సహించారు.విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.విద్యారంగానికి టిడిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. సిఎం చంద్రబాబు విద్యాప్రమాణాలు పెంచుతారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సంపత్, సహదే వయ్య, వరప్రసాద్‌రెడ్డి, రామా నుజమ్మ, అరుంధతి, మంగమ్మ, సరస్వతి, సబిత, ఉషారాణి, అశోక్ నాయక్, ముబారక్, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**డిప్యూటీ డిఇఒ కృష్ణప్పా**

**ప్రజాశక్తి - వేంపల్లె (వీరపునాయునిపల్లె)**

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యాబోధనతోపాటు నాణ్యమైన భోజనం వడ్డించాలని ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒ కృష్ణప్పా సూచించారు. వీరపునాయనిపల్లి మండలంలోని పాయసంపల్లె ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీశారు. అనంతరం డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను ప్రతి విద్యార్థికి అందజేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం పాఠ శాలలో విద్యార్థులకు ఉన్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 5న ప్రత్యేక విద్యుత్ అదాలత్

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

ఈనెల 5న ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అదాలత్ కార్యక్రమం పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డులోని సెక్రటేరియట్‌లో నిర్వహిస్తారన్నారు. వినియోగదారులు తమ సమస్యలను పరిష్కార వేదిక దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

## రెండు నెలలపాటు చేపల వేట నిషేధం

**ప్రజాశక్తి - కొండాపురం**

గండికోట ప్రాజెక్టులో రెండు (జులై,ఆగష్టు) నెలలపాటు చేపలు వేటను నిషేధించినట్లు మత్స్యశాఖ అధికారిని మల్లీశ్వరి తెలిపారు. ఈ రెండు నెలలు చేపలు సంతానోత్పత్తి పక్రియ జరిగే కాలమని తెలిపారు. చేపలు గుడ్లను కలిగి ఉంటాయని, ఈ సమయంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపలు వేట నిషేధమన్నారు. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

## పింఛను అందలేదని డయాలసిస్ రోగి ఆవేదన

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

తనకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందలేదని మండలంలోని సోమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కలివేల మరియన్న అనే డయాలసిస్ రోగి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అయిదేళ్లుగా వైసిపి ప్రభుత్వంలో పెన్షన్ అం దేదని తెలిపాడు. ప్రతి మంగళవారం, శుక్రవారం చికిత్స కోసం వెళ్లాల్సి ఉందని తెలిపాడు. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ అంతోఇంతో సాయంగా ఉంటుందని సంతోషంగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు డయాలసిస్ పేషెంట్లకు రూ.10వేలు పింఛన్ ఇస్తారని తెలపడంతో సంతోషపడ్డాడు. అయితే పింఛన్ రాకపోవడంతో ఆయన ఆవేదన చెందు తున్నాడు. నెలకు రూ.10వేలుకుపైగా ఖర్చు వస్తుందని.. ఏమి చేయాలో అర్థంకాక అయోమయ స్థితిలో మరియన్న కుటుంబం ఉంది. పింఛను విషయమై సచివాలయం సిబ్బందిని అడగగా.. మీరు అనర్హుడు అని చూపిస్తోందని చెబుతున్నారని ఆవేదన చెందాడు. తనను ఆదుకోవాలని బాధితుడు సంబంధిత అధికారులను కోరుతున్నాడు. ఎవరు కూడా పట్టించుకోలేదంటూ బాధితుడు తెలిపాడు.

## విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ఖాజీపేట జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురి కావడం దురదృష్టకరం, బాధాకరమని మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండడాన్ని డిఎల్ గమనించారు. స్థానిక ప్రాథమిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య వివరాలను, పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించకపోవడం బాధాకరమన్నారు. కలుషిత తాగునీరు, అపరిశుభ్రత కారణంగా అస్వస్థతకు గురయ్యారని వైద్యులు నిర్ధారణకు వచ్చారు. పాఠశాల విద్యార్థులకు శుద్ధి నీరు అందించేందుకు తాను కృషి చేస్తానని, ఆ దిశగా చర్యలు తీసుకుంటానని డిఎల్ పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులు పట్ల బాధ్యతారహితంగా ఉపాధ్యాయులు ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రులు కొందరు డిఎల్ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అంకిత భావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని డిఎల్ ఉపాధ్యాయులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

# క్రైం కార్నర్

## నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**ప్రజాశక్తి-రామాపురం**

మండలంలోని రాచపల్లి పంచాయతీ మంగళ పల్లె వద్ద మంగళవారం అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ బిఎల్.ప్రసాద్ తెలిపారు. ఇసుక రవాణకు సంబం ధించి ఎలాంటి ఆధారాలు, అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే ఇసుక ట్రాక్టర్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ఎపిఎండిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**- టిడిపి ఇన్‌ఛార్జి 'ముక్కా', ఎమ్మెల్యే శ్రీధర్‌కు వినతి**

**ప్రజాశక్తి-పుల్లంపేట**

ఎపిఎండిసి పనిచేస్తున్న కార్మిక సమస్యలపైన ఎపిఎండిసి అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మిక పోరాట కమిటీ జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ జెఎసి కన్వీనర్ రేకులకుంట వెంకటేష్ మాట్లాడుతూ .సుమారు 15 సంవత్సరాలుగా అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులుగా చాలీ, చాలని వేతనాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నారని వీరందరి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. సంస్థ నిర్వాసిత కార్మికులను పర్మినెంట్ చేయకుండా దొడ్డి దారిన జిఒ నెంబర్ 39ని తీసుకుని వచ్చి 151 పోస్టులు భర్తీ చేయాలని, వెంటనే ఆ జిఒను రద్దు చేయాలన్నారు. సుమారు 400 పర్మినెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిని అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులతో భర్తీ చేసి వారి కుటుంబాలని ఆదుకోవాలని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి సుమారు రెండు సంవత్సరాలు అయినా ఇంతవరకు సావంత్సరిక ఇంక్రిమెంట్ ఇవ్వలేదని, కార్మికులకు ఇంక్రిమెంట్ ఇప్పించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనంలో 20శాతం మంది కార్మికులకు వారు పనిచేస్తున్న పనిని బట్టి హోదా కల్పించలేదని, ఈ విషయం పైన గత

రూపానందరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జెఎసి నాయకులు

ఎండి సమావేశం ఏర్పాటు చేసి నిజమని తెలుసుకుని పరిష్కారం చేస్తామని ఒప్పుకున్నారని దానిని అమలు చేపించాలన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు నేరుగా సంస్థనే జీతాలు చెల్లిం కాంట్రాక్టు లు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎండిసి ఎంప్లాయిస్ వర్కర్స్ యూని యన్ జనరల్ సెక్ర టరీ నారదాసు సుబ్బరాయుడు, జనరల్ సెక్రటరీ బండారు భాస్కర్, పోరాట కమిటీ జెఎసి నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# రైతులు అధికారుల సూచనలు పాటించాలి

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

ఉద్యానవన పంటల సాగులో అధికారుల సూచనలు, సలహాలు రైతులు తప్పక పాటించాలని మదన పల్లె డివిజన్ ఉద్యానవన శాఖాధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారుతో సమీక్ష సమావేశం నిర్వహించి, ప్రతి మంగళవారం ప్రజలకు, రైతులకు అధికారులు అందు బాటులో ఉండాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఆ మేరకు ఇకపై ప్రతి మంగళవారం ప్రతి శాఖాధికారి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఉద్యానవన పంటల సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలు, యాజమాన్య పద్ధతులపై రైతులు అధికారులను సంప్రదించాలని కోరారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఉద్యనవన పథకాలు, డ్రిప్‌లు,

మాట్లాడుతున్న వైద్యాధికారి ఎం.వి.కిషోర్‌కుమార్‌రెడ్డి

స్పింకర్లు కొరకు ప్రభుత్వానికి నివేదిక సిద్ధం చేసి పంపడం జరిగిందన్నారు. ప్రభుత్వము నుంచి ఆమోదం రాగానే తెలియ జేస్తామని, రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మండలంలో 1300 ఎకరాల్లో ప్రస్తుతం మామిడి సాగులో ఉందన్నారు. మామిడిలో అధిక దిగుబడికి కాయ లు కోత అనంతరం కొమ్మలను కత్తరించాలని, పది సంవత్సరాల చెట్టుకు యూరియా 1.5 కిలో, సూపర్ ఫాస్పేట్ -3 కిలోలు, పొటాష్-1 కిలో చెట్టు మొదల్లో వేసి నీరు పెట్టుకోవడం వలన కొత్త కొమ్మలు అన్నీ ఒక్కసారిగా చిగురించి, ఒకే సమయానికి పూత వచ్చి, కాయలు ముదిరి మంచి దిగుబడి వస్తుందని అన్నారు. రైతులు పంటల సాగులో మెలకువలు పాటించడానికి అధికారులను సంప్ర దించి వారి సూచనలను, సలహాలను, యాజమాన్య పద్ధతులను పాటించడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు.

# మెరుగైన వైద్యసేవలు అందించాలి :డిఎంహెచ్ఒ

**ప్రజాశక్తి-పుల్లంపేట**

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్ఒ కొండయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఒ, సిహెచ్ఒ రామకృష్ణయాదవ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న ఒపిసేవలు, ల్యాబ్‌లకు సంబంధించిన పరీక్షలు ఆస్పత్రిలో కాన్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, రిపోర్టులు పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో భాగంగా అనంతసముద్రం గ్రామ సచివాలయంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి ఉధృత అతిసార నియంత్రణ మాసోత్సవాలు జులై ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31న వరకు జరుగు తాయని, 0-5 సంవత్సరాల లోపు పిల్లలు అర్హులని మండలంలోని ప్రతి గ్రామ సచి వాలయం, అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాలలో ఒఆర్ఎస్, జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని, సురక్షితమైన మంచినీటిని తాగాలని అవగా హన కల్పించారు. కార్యక్రమంలో

విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు నేర్పుతున్న డిఎంహెచ్ఒ కొండయ్య

మండల వైద్యశాఖ అధికారులు డాక్టర్ సానేశేఖర్, డాక్టర్ మనోజ్‌కుమార్, సూపర్వైజర్లు, ఎమ్మెల్యే హెచ్‌పి, ఎఎన్ఎంలు, ఆశా కార్య కర్తలు పాల్గొన్నారు.

# అతిసార నివారణకు కృషి చేయాలి

నందలూరు : మాట్లాడుతున్న వైద్యులు

**ప్రజాశక్తి-కలకడ**

మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న చిన్నపిల్లల గురించి గృహ సర్వే నిర్వహించాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్‌వి.కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆశాడే సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాలలో పిల్లల గృహ సర్వేలు నిర్వహించి ఒఆర్ఎస్ క్యాంపెయిన్ నిర్వహించి డయేరియా గురించి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు ఎంఎల్‌హెచ్‌పిఒలు, స్టాఫ్ డయేరియా గురించి ఒఆర్ఎస్, జింక్ టాబ్లెట్స్ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లను ఎక్కువ సంఖ్యలో పెట్టాలని గ్రామాలలో ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, బాలింత సంరక్షణను పాటించాలని సూచించారు. సురక్షితమైన ఆహారం, మంచినీరు బిడ్డలకి ఇవ్వాలని, పాలిచ్చే తల్లులు ఆవశ్యకతను గురించి తెలియపరచాలని పేర్కొన్నారు. విస్తరణ అధికారి జి.జయరామయ్య మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధి నివారణ పై సర్వే చేయా లని మగవారికి మగ వాలం టరీ చేత, మహిళలకు ఆశాల ద్వారా పరీక్షలు నిర్వహించి రిపోర్టు చేయాలని అన్నారు. లెప్రసీ సర్వేలో ఒక్కొక్క ఆశ కనీసం పది మంది వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. స్పర్శ లేని పొడలు, శరీర చర్మం ఉండవలసిన దానికన్నా ఎక్కువ మెరుస్తూ వేసుకున్న చెప్పులు జారిపోవుట, అరికాళ్ళు అరిచేతులు స్పర్శ లేకుండా పోవుట, చల్లటి, వేడి నీటిలో గుర్తించలేకపోవుట వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి పిహెచ్‌సికి తీసుకరావాలని తెలిపారు. కార్యక్ర మంలో ఎంపిహెచ్ఇఒ జయరామయ్య పిహెచ్ఎన్ శుభ్రతమ్మ, హెల్త్ సూపర్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఎన్.వాణి, శ్రీలక్ష్మి, జె.భాగ్య మ్మ, డి.వరలక్ష్మి, ఎస్‌వి.రవణమ్మ, బి.లక్ష్మి ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-నందలూరు :** అతిసార నివారణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ వైద్యులు శరత్‌కమల్, కార్తీక్‌విశ్వనాథ్‌లు పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు మాట్లాడుతూ పిల్లల్లో అతిసార నివారించుటకు ఐదేళ్లలోపు పిల్లలు ఉండే గృహాలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వవలెనని సిబ్బందికి సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవము గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆశా కార్యకర్తలకు, ఎఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పి లను ఆదేశించారు. సమావేశంలో సిహెచ్ఒ వెంకటనారాయణ, పిహెచ్ఎన్ శైలజ, సూపర్వైజర్ సునీల్ పాల్గొన్నారు.

# గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

**ప్రజాశక్తి-రామాపురం**

గర్భిణులు క్రమ తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా మాతా శిశు సంరక్షణ శాఖ పీడీ శశికళ పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు సెక్టార్ పకీరుపల్లె అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం అక్షరాభ్యాసం, సామూహిక సీమంతాలు, గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో గ్రామాలలో డయేరియా ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున పిల్లలు తల్లిదండ్రులకు జూలై నెల అంతా నీటిని కాచుకొని తాగాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చెప్పారు. విద్యా సంవత్సరం మొదలవడంతో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించాలని, గర్భిణులకు సీమంతాలు చేయించాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాలు పూర్తయినా పిల్లలను ప్రైమరీ స్కూల్‌లో చేర్పించి, అంగన్వాడీ గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించాలన్నారు. కార్యక్ర మంలో లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి సూపర్వైజర్లు, సుజాత, పద్మజారాణి

గర్భిణికి సీమంతం చేస్తున్న పీడీ శశికళ

అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్సీ ఆరా

పిఆర్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లెకు విచ్చేసిన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని అధికారులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం స్థానిక రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలో ఎమ్మెల్సీని పంచాయతీ రాజ్ డిఇ రవిచంద్రారెడ్డి, రోడ్డు భవనాల శాఖ ఎఇ వెంకటరమణ, గండి దేవస్థానం ఇన్‌ఛార్జి ఇఒ వెంకట సుబ్బయ్య, గండి ప్రధాన అర్చకుడు కేసరి స్వామితో పాటు టిడిపి నాయకులు ఎద్దుల కొండ్రాయుడు, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, జివి రమణ, కావాలి భానుకిరణ్, డివి సుబ్బారెడ్డి కలిశారు. సమస్యలను విన్నవించారు. గత ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులను ఎమ్మెల్సీ అడిగి తెలుసుకున్నారు. అలాగే రోడ్డు విస్తరణ పనులపై కూడా ఆరా తీశారు. గండి అభివృద్ధికి కృషి చేయాలని ఇఒ వెంకట సుబ్బయ్యను ఎమ్మెల్సీ కోరారు. అవినీతిని అరికట్టాలని పేర్కొన్నారు. పార్టీ పరిస్థితిపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. అధికారుల పని తీరుపై టిడిపి నాయకులు ఎమ్మెల్సీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మండలంలోని తువ్వపల్లె పాఠశాల వద్ద కొన్నేళ్లుగా వర్షపు నీరు నిలవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించేలా పనులు చేయాలని టిడిపి నాయకుడు డివి సుబ్బారెడ్డి కోరారు. ఇంజనీరింగ్ అధికా రులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

ప్రిన్సిపల్ శ్యామలాదేవితో మాట్లాడుతున్న ద్వారకనాథ్‌రెడ్డి

## ఆదర్శ పాఠశాలను సందర్శించిన 'గడికోట'

**ప్రజాశక్తి-రామాపురం**

మండలంలో ఆదర్శ పాఠశాలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి సందర్శించారు. బాలికల వసతి గృహంలో వంటగది, తాగునీటి కుళాయిలను, పరిసరాలను పరిశీలించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలదేవి పాఠశాలలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధాన సమస్యగా హాస్టల్ ఆవరణంలో రాత్రి సమయంలో లైటింగ్ సమస్య ఉందని, వెనుకవైపు గుట్టప్రాంతం ఉండడం వలన రాత్రి సమయంలో విషపురుగులు ఎక్కువగా వసతి గృహం లోకి పరిసర ప్రాంతాలలోకి వస్తున్నాయని ఆయన దృష్టికి ఆమె తీసుకెళ్లారు. వెంటనే స్పందిన ద్వారకనాథ్‌రెడ్డి తన సొంత నిధులతో లైటింగ్ కొరకు విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. త్వరగా పాఠశాల ఆవరణంలో పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాటు చెపిస్తానని, పాఠశాలలో లో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ఆయన తోపాటు ఆదర్శ పాఠశాల సిబ్బంది, టిడిపి చిలేఖంపల్లె శివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

విద్యుత్ బిల్లుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల రూరల్ ఎడిఇ జయసుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లుల వసూలులో సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా ఉన్నారని.. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్ బిల్లులను ప్రస్తుతం గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా చెల్లించే అవకాశం ప్రస్తుతం లేదన్నారు. కేవలం డిస్కం యాప్, మొబైల్ యాప్ ద్వారానే చెల్లించే అవకాశం ఉందని, ఈ విషయంపై వినియోగదారులకు అవగాహన కల్పిం చాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ సుబ్రమణ్యం, మండలంలోని సిబ్బంది పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్ వేలం వాయిదా

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

2024-25 ఆర్థిక సంవత్సరంలోని తాత్కాలిక కూరగాయల మార్కెట్ వేలం వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ప్రొద్దుటూరు పురపాలక సంఘానికి సంబంధించిన మున్సిపల్ గ్రౌండ్‌లో ఉన్న తాత్కాలిక దిన కూరగాయ మార్కెట్‌తోపాటు వాహనాల పార్కింగ్ రుసుం వసూలుకు గుత్త హక్కుకోసం బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జరుపవలసి ఉన్న బహిరంగ వేలాన్ని వాయిదా వేసినట్లు కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## జనసేన పార్టీ బలోపేతానికి కృషి

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు చెప్పారని జమ్మల మడుగు జనసేన కో-ఆర్డినేటర్ దేరంగుల జగదీష్ తెలిపారు. మంగ ళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం తాను నాగబాబును మర్యాద పూర్వకంగా కలిశానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నియోజక వర్గంలోని ప్రధాన సమస్యలను నాగబాబు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని జగదీష్ తెలిపారు.

## అన్ని హామీలను అమలు చేయాలి

**- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం సామాజిక ఫించన్లు ఇంటి వద్దనే పంపిణీ చేయడం హర్షణీయమని, వీటితోపాటు మిగతా అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కోరారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ భృతి అమలు చేయాలన్నారు. తల్లికి వందనం, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థికసాయం చేయాలని కోరారు. 19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వరకు ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇచ్చే హామీని కూడా నిలుపుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని కోరారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే ఫించన్ సౌకర్యం కల్పించాలన్నారు. వీటి అమలుకు జిఒలు జారీ చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో టిడిపి ఇచ్చిన హామీలను ఎప్పటి నుండి అమలు చేస్తుందో ప్రజలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ కోరుతున్నట్లు తెలిపారు.

**ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024**

# ఎంట్రీలకు ఆహ్వానం

*ప్రియమైన మిత్రులారా!*

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

**ఎంట్రీలు పంపాల్సిన చిరునామా**

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ